
PRAHASANUM SERIES NO. 2.

MAHAYOGA RAHASYAM.

మహాయోగరహస్యప్రహసనము.

Vice Condemned.



BY

RAJA M. BHUJANGA RAU,

BAHADUR, ZAMINDAR,

ELLORE.

SECOND EDITION.

THE MANJUVANI PRESS.

1904.

 [Price 2 Annas.

Printed by N. ChalapatiRau.

శ్రీరస్తు.

మహాయోగరహస్యప్రహసనము.

ఇది.

అష్టావధాని

శ్రీరాజా మంత్రిప్రగడ భుజంగరావు

బహద్దరు జమీందారుచే

రచియింపఁబడినది.

1904

మంజువాణీ ముద్రాక్షరశాల

ఏలూరు.

రెండవతూరి 1000 కాపీలు.

వెల 2 అణాలు.

మార్కండేయస్వామినే నమః.

శ్లోకము.

శ్రీమ ధ్యాయామి మిధ్యాచకవికచచ్చైత్య సత్యస్వరూపమ్।
హృద్యంసన్మౌని వేద్యంశ్రుతిమహితసతీభాగ్యసౌభాగ్యకందమ్।
సిద్ధంసర్వానువిద్ధంపరమశివమయంభవ్యదివ్యప్రకాశమ్।
మార్కండేయేశ్వరాఖ్యంనతజనసుఖదంభాగధేయంమదీయమ్॥

ఇందువచ్చుపాత్రలు

పురుషులు

1. యోగి-కథానాయకుఁడగు వెంకన్న.
2. వీరాస్వామి-వంచకుఁడు.
3. షుబేదారు-వీరాస్వామి స్నేహితుఁడు.
4. సిద్దెయ్య-షుబేదారుస్నేహితుఁడు.
5. వెంకోజీపంతులు-షుబేదారుసిద్దెయ్యలకుగురువు.
6. అవధూత-వేదాంతి
7. క్రిష్ణారావు-అవధూతశిష్యుఁడు.
8. లక్ష్మయ్య-వెంకన్నయూరివాఁడు.
9. పరమహంస మహాయోగి.
10. రామప్ప-పరమహంసశిష్యుఁడు.

స్త్రీలు

1. లక్ష్మమ్మ-వెంకోజీపంతులుభార్య.
2. వెంకాయి-ఒకపడుచుస్త్రీ
3. నాగరత్నము-వెంకాయిస్నేహితురాలు.
4. విశాలాక్షి-పంతులుశిష్యురాలు.
5. సుందరము-విశాలాక్షిస్నేహితురాలు.

శ్రీరస్తు.

మహాయోగరహస్యప్రహసనము.

రంగము—ఏలూరుసత్తెయ్యనాయుడుగారి తోటచాయలు.

కాకాయని పక్షికులసహస్రంబు లరుణోదయరహస్యమును వెల్లడి చేయనో వాగ్వాదలు చేయుచుండెను. ఝుమ్మనిమూగు తుమ్మెదల దిమ్ములకులికిపడి లేచినట్లు పల్లవులచాటులనున్న ప్రసవములు విచ్చుచుండెను. వాసంతికతరునికరములు చివురుబాణముల సంధించి వసంతాగమము నిరీక్షించుచు మనోహరముగా నుండెను. రేపకడ పతులతో నతులగతి రతిపరిశ్రమనొందిన సారసనేత్రల చిరుచెమ్మటల నార్చుటకో యన, మందమారుతము పరిమళపరిమిళితమ్మగు పుష్పగంధవహమయి వీవఁ జొచ్చెను. అంత దిక్ప్రళయమును సూచించుచు నరుణోదయము దశదిశల నలంకరించె. లేఁజివురు మెక్కిన మైమరపుచే నొడలెఱుఁగక కూయు వనపుంస్కోకిలారావములకు మారెలుంగు లిచ్చుచు వారిజనేత్రలు తిరుగసాగిరి. తెలిహానముల చాడ్పున బైసికిలు బండ్ల నెక్కి కొందఱు పోవుచుండిరి. గుఱ్ఱపుబండ్ల నెక్కి వంతెనయంతయు నదురునట్లు నాన్నమిస్సెకముగా భూమి గజగజ వడంకునట్లు పరువులెత్తించుచు, గొందఱు ప్రముఖులు వెడలుచుండిరి. వంతెనక్రింది కాల్వలో గడలు వేయుచు, పడవల నడుపుచుండిరి. నీళ్ళబిందెల బుజముపై పెట్టుకొని స్త్రీలనేకులు ప్రసంగములు చేసికొనుచు నడచుచుండిరి ఎటుచూచినను ప్రపంచమంతయు నొక్కసారి జీవవంతమైనట్లు కన్పట్టె.

(అప్పుడు నీళ్ళబిందెలతో వెంకాయి, లక్ష్మమ్మ
ప్రవేశించుచున్నారు)

వెంకా—ఏమమ్మా అక్కా! ఇవాళేకామల్లు మూడువందల యేండ్ల మహాయోగి వచ్చేది. మూఁడువందలయేండ్లు యెలాబ్రతికాడో! అదినాకుతెలిసివుంటే యీపాటికి మా అమ్మను చచ్చిపోకుండా బ్రతికించేదాన్నే. నిజంగా మూడువందలయేండ్లమ్మా!

లక్ష్మ—మూడువందలయేండ్లమాట నిజమేట మా ఆయన రాత్రి యింకెవరో అయిదువందలయేండ్ల మహాయోగి కూడావున్నారన్నారన్నారు. ఇవాళ రావటము నిజమే- అందుకనే మా ఆయన నన్ను పెందలాడే వంటచేయుమన్నారు-

వెంకా—ఇదుగో నమ్మోయి- ఆక్కేమవుతుందోగాని వూరంతా మట్టుకు అట్టుడికినట్టుడికిపోతున్నది

లక్ష్మ—ఏమీకావటమేమిటి? ఇవాళ రానేవస్తాడు-

వెంకా—అవును, నిజమే- ఆయనకేమి యెడ్లు కదలాలా, బండ్లుకదలాలా? "జయపరమేశ్వరా" అని యెప్పుడు తలుచుకుంటే అప్పుడే వచ్చివాల్తాడు

లక్ష్మ—అమ్మాయి నే వెడతా, మళ్ళీఅలస్యమయితే చంపుతాడు, వాళ్ళో పెళ్ళి కుక్కలకడావిడి అన్నట్టు యే వేదాంతులొచ్చిన మాకొంపమీఁదికే వస్తుంది, మరీ మాకోసు వేదాంతదారికాదు, ఆతగాడి వల్ల సంసారం కుంపయిపోతున్నది,

వెంకా—నిజమే, ఒక్కరు పట్టుకొని మిడికితే యేమయినట్టు అదుగో నాగరత్నము వాండ్లు వస్తున్నారు, నే వాళ్ళతో వస్తా వెళ్ళండి-

(అప్పుడు నాగరత్నము మొదలుకొందఱుస్త్రీలు
వచ్చుచున్నారు)

నాగ—ఓహో! వెంకాయి కాఁబోలు, ఎన్నాళ్ళకు కనుపడ్డావే. ఇవాళరానిచ్చిందీ మీ అత్తగారు ?

వెంకా—మా అత్తగారు వూళ్ళో లేదు, నిన్ననే విశాఖపట్టణము వెళ్ళింది,

నాగ—అలా చెప్పు అందుకనే తీరిక చేసుకొని బయలుదేరావు. ఏమిటి లక్ష్మమ్మతో మాటలాడుతున్నావు, ఆవిడ మొగుడి వేదాంతమేమయినా నీకు చెప్పుతాను రమ్మన్నదాయేమిటి? వాండ్లయింట్లో కోటీశ్వరయోగియున్నాడులే, నిన్ను శిష్యురాలను కమ్మనమంటున్నదాయేమి ?

వెంకా—అబ్బే అదికాదు. మహాయోగి ముచ్చట్లు చెప్పుకుంటున్నాము, నీవువిన్నావా ?

నాగ—విన్నావా అంటా వేమిటి. ఊరంతా వుడికిపోతూ వుంటే- ఇవాళ కచ్చేరీలకన్నీ శలవు యిస్తారట, ఇస్కూళ్ళు కూడా కట్టివేస్తారట. మా ఆయన యింకా యిస్కూలుకు వెళ్ళలేదు-

వెంకా—నాగరత్నం, అన్నివందల యేండ్లున్నవాఁడు యెంత ముసలి తొక్కవలె వుంటాడో!

నాగ—పడుచువాడివలె వుంటాడఁట. ఆయన అందఱివలెఁ గాక నిజముగా చాలామహాత్మ్యము కలవాఁడేఁట. దొరలుకూడా అనేకమంది పరీక్ష చేసి అపరాధముని చెంపలు వేసుకొన్నారఁట.

వెంకా—అవును. ఏపుట్టలో ఏపాముందో ఎవరికి తెలుసు ? ఎంతెంత వాండ్లులేనిదీ యీప్రపంచమిల్లా నిలిచిందీ-

నాగ—ఎవరే వెంకాయీ ఆయన యిందాకటినుంచీ మన మాటలన్నీ వింటూనుంచున్నాఁడు ఆగట్టుమీద ?

వెంకా—మీ ఆయనబావమరిది

నాగ—మా ఆయన బావమరిదిగాఁడు- మీ అమలాపురం పెద్దబావ.

వెంకా—మరియెవరంటే నాకేం తెలుసునని అడిగావు ?

నాగ — మరదలవు నీకింతమాత్రము తెలియదా అనుకున్నా ఎవరయి
తేనేమిలే యోగిముచ్చట చెప్పుకుంటున్నామని విన్నాడు కాఁ
బోలు. ఇప్పుడిదో వేలం వెఱ్ఱి బయలుదేరిందిగా.

వెంకా. — వదినె నేవెడతాన్నా.

నాగ — సరే. నేనువస్తాపద.

(ఆమాటలవిని వీరాస్వామి యిట్లనుకొనుచున్నాఁడు)

వీరా — (తనలో) ఇదిమహామంచిసమయముగావున్నది. క్రిందబారేచీ
మ, పైనబొయ్యేపక్షీ యావన్మంది యోగిమాటేచెప్పుకొంటున్నా
రు. ఎవరినోటవిందామన్నా యిదేకబురు. షుబేదారు నేను వె
ళ్ళగానే నిముషములో లొంగిపోయినాడు. ఇఁక నేను బోయి
వెంకన్నను మహాయోగిగా మార్చవలెను అదుగో నాకోసము వ
స్తూనేవున్నాఁడు

[అనితోటలోనికిఁబోయి]

వీరా — నీవిఁక తిన్నఁగావుండాలి అందఱునిన్ను చూడడానికి వస్తారు
జాగ్రత్త మనకపటము తెలియనియ్యఁగూడదు సుమా

యోగి — ఏమిచెయ్యమంటే అదేచేస్తాను.

వీరా — నీతిరుపతిమొక్కుకు పెంచినగోళ్ళూ తలాయిందుకు పనికివ
చ్చింది నీవుమాటాడకనూరొచ్చి ఎండఋవచ్చినాసరే కన్నులుమూ
సుకోవాలి,

యోగి — నేనెంతసేపఁమూసుకోను? గంటకోమాటయినా తెరవకపో
తే వుండలేను అదిసరే నాకు మూర్ఛవస్తే యేమిచెయ్యను? మూ
ర్ఛతోపాటు నోటనురగపడుతుంది.

వీరా. — కన్నులుమధ్యమధ్య తెరవవచ్చును మూర్ఛమాటే — (తనలో)
ఒకటికుదిరితే ఒకటికుదరదు గోళ్ళు, తల, గడ్డము యెదిగిందిగ
దా అనిచూస్తే మూర్ఛరోగము వకటిపట్టుకుంది. [ప్రకాశము
గా] నీకుమూర్ఛయెన్నాళ్ళకోసారి వస్తూవుంటుంది

యోగి—ఎప్పుడుపడితే అప్పుడేవస్తుంది.

వీరా—పోనీ యీవాళిటికి ఆపుకోలేవు?

యోగి—ఆపుకుంటేఆగదు. మూర్ఛవచ్చేటందరమట్టుకు నన్ను జాగ్రత్తగా కనిపెట్టాలి!

వీరా—సరేగాని ఎవరయినా పెద్దలువస్తే మూర్ఛరావద్దు. అంతాకన్నా సైగచేతనే తెలియచెయ్యవలెను- అనేకవేలమందివచ్చి పాదాలమీఁదబడతారు. బహుజాగ్రత్తగా సంచరించాలిసుమా.

యోగి—పాదాలమీఁదబడితే నాకు చక్కిలిగిలి వేస్తుంది నవ్వువస్తుందేమో?

వీరా—రామరామ! నీతో అన్నీచావులే-నీపుణ్యమాయిరిగానిఅల్లాచిమాన అధికాచనూవాలకని మధ్యమధ్య లేచిపోకు- అప్రతిష్టవస్తుంది-

యోగి—అబ్బో! నాకు అసలు అతిమూత్రం అందుకనే తలగడ్డము పెంచి వెంకటేశ్వరులకు మొక్కుకున్నాను. అదిమట్టుకు ఆపటం నాతరంగాదు- లేకపోతే నేను వూరికేవుంటాను నీవు యోగివిగా

వీరా—నాకుగోళ్ళు, గడ్డమువుంటే నిన్నానిన్నా బ్రహ్మలకనే పోదును- ఎలాగయినా నీవేసర్దుకోవాలి అదుగో యెవరోవస్తున్నారు- ఈతెరలోకూర్చో చంకలో పంగలకఱ్ఱ ఆనుకో జాగ్రత్త మధ్యమధ్య మాట్లాడాలంటే బ్రహ్మసత్యం- జగత్తు మిథ్య అనిమాత్రమను- అదుగోదగ్గరకు వస్తున్నారు మాటదక్కించాలి వేలకువేలు వరషము కురుస్తుంది- నేను ముందుపారిణాచారము పడతాను. కన్నులుమూసుకో-

[అప్పుడు షుబేదారు ప్రవేశించుచున్నాడు.)

వీరా—మీరా! ఎవ్వరోఅనుకున్నాను ఇంకా తమరురాలేదనిమె

దూరుచూస్తున్నాను- తూర్పువీధి అవధూత మహా అసాధ్యపు వేదాంతి వున్నాడట- అతఁడేమయినా చేస్తాడేమో అని భయంగావుంది. అయినా అన్నిటికి మీరేవున్నారు.

(చెవిలో నేమియో చెప్పుచున్నాడు)

షుబే— నేను వెళ్ళి వెంటఁబెట్టుకొని వస్తాను. జాగ్రతగా వుండండి- (తనలో) ఏదోవిధముగా అయ్యగారిని లేవదీస్తే యింక అంతా సాగిపోతుంది, ఇక్కడికే యెనిమిదిగంటలయింది, అయ్యగారు యింట్లోవున్నారో లేనేలేరో త్వరగా వెళ్ళవలెను-

(అని వెళ్ళి పంతులుగారి తలుపుకొట్టుచున్నాఁడు)

లక్ష్మి -(తలుపుచాటునుండిచూచి తనలో) ఈషుబేదారుతో మా సంసారం కూలిపొయ్యేయోగంవచ్చింది. పిల్లివలె అన్నీ అంటిస్తాడు, తనపించక్ మట్టుకు తానుదాచుకుంటాడు, ఈవెధవవేదాంతముతోనే మాకొంప మునిగింది, (తలుపు దెరచి ప్రకాశముగా) షుబేదారుగారేనా? ఎవరో అనుకున్నాను, పంతులుగారెక్కడికో తెల్లవారుఝామున లేచివెళ్ళారు ఇంకా రాలేదు. కచేరీ పని మీఁద వెళ్ళారేమో;

షుబే— అక్కా- మంచిసమయములో నేలేరు- ఎవ్వరితో చెప్పకండి- మహాయోగివచ్చి మానసత్తెయ్యనాయుఁడుగారి తోటలోదిగాడు-

లక్ష్మి— (తనలో) నాప్రాణము గుబుకూ గుబుకూ అన్నట్టే అయింది- వూళ్ళోకి యేదివచ్చినా ముందు మాకొంపమీఁదికి వస్తుంది నే నెన్నివిధాలచెప్పినా వినరు. ఇక్కడికి మంగయ్య కియ్యవలసినపద్దలాగేవుంది. ఈసంసారం ముందుకురాదు- చెపితే అయిదు తట్టులకోపం-

షుబే— అమ్మగారూ! సిద్దయ్యగారిని పిలుచుకొస్తానుగాని అయ్యగారువస్తే యోగివచ్చాడని చెప్పి యింట్లోవుండమనండి.

లక్ష్మి— నా ఆజ్ఞమీఁదవుంటారా? చెపుతాను- ఇవాళమంగయ్యబాకీ ఫయిసలు చేయిస్తు- మళ్ళీపరపతిపుట్టును.

(అప్పుడుకిఱ్ఱుచెప్పులు తొడుగుకొని వెంకోబరావు పంతులు ప్రవేశించుచున్నారు)

వెం:—ఏమండోయి షుబేదారుగారు, ఇవాళ కైవల్యామృత సార సంగ్రహ పత్రికవచ్చిందా? ఏమేవు, ఇదుగో తలగుడ్డ అవతల బెట్టి కొంచెము తరువాణితేట తీసికొనిరా.

లక్ష్మి—(కొంచెము విసుగుకొనినట్లుగా) మీకన్నీ పాడు అలవాట్లు అబ్బుతున్నాయి. బ్రాహ్మణీకం పాడయిపోయింది.

షుబే—అయ్యగారూ! మహాయోగిగారువచ్చి మా సత్తెయ్యనాయుండుగారితోటలో దిగారు. ఎంతసాధువులండి. గొప్పమహాత్ములు. తమదర్శనప్రకారమే అయింది.

వెంకో—నేను రాత్రి ప్రసాద స్వీకారమందు చెప్పలేదూ కొంచెము దృశ్యముగా కనుపించినదని? గడ్డము గోళ్ళు బాగా యెదిగివుండాలి. కొంచెముశుష్కించినట్టులేదూ?

షుబే—గుర్వాజ్ఞ తమకు తెలియనిదేమున్నది, తమ కేవిధంగా ద్యోతకమయిందో అంతా ఆదేతీరుగా వున్నది. గొప్పసత్వము వుంది లోకులు అజ్ఞానులు. తనలో జీవము తానెఱుంగనట్టే ఆయన వున్నచోటు తెలియక రయిళ్ళు పడవలుపట్టుకొని తిరుగుతున్నారు. తమకు ముందే తెలిసినది. యోగ్యుల సహవాసము సామాన్యముగాదు.

వెంకో—వెఱ్ఱివాళ్ళు, మహాయోగులెప్పుడూ అకాత్తుగా వస్తారు గాని అట్టహాసముగా రానేరారు. వారికీలోకపుబంధ్లతో పనే లేదు. మనోవేగం చేత వేవస్తారు.

షుబే—గురువాజ్ఞ. ప్రొద్దెక్కుతున్నది.

వెంకో—అవధూత యివాళ రంగనాయకమ్మకు ఒప్పుకొన్నాట్ట. అతడేదో ఒకటి చేస్తూనే వుంటాడు. అయినా మనము రమ్మంటే రా

డా ? మొన్నటివిషయములో కొంచెము అతను నేను తలపట్లుపట్టుకున్నాము.

షుబే—అయినాతను అజ్ఞ అంటేవస్తాడు. ఎన్నాళ్ళ నుండో ఆశ్రయించినదని తనతో మనవిచెయ్యకుండా చేశానని బుద్ధిపొరపాటు అని మాతో చెప్పాడు. క్షమించండి.

వెంకో—కేసుదాఖలవుతుందనివిన్నాను. అంత బలవంతము తేనకెందుకు ?

షుబే—మంచివుద్దేశ్యముతో చేసిన జ్ఞానబోధ నేరమేనా ?

వెంకో—పినల్ కోడ్డులో అలా శిక్ష వుంది సరే అతనిమాట అలా వుండనీ. మనమైనా త్వరగావెళ్ళాలి. ఏమేవు. ఏంజేస్తున్నావు వాసిప్పంతీసుకురా.

లక్ష్మ—ఏమీలేదు మంగయ్యకు బట్టలతాలూకు పైకమియ్యాలట. ఇదుగో ఈలెక్కకాగితం యిచ్చి వారమురోజులలో సొసాయించకపోతే యికమాటదక్కదన్నాడు.

వెంకో—(మండిపడుచు) ఏడిశావులే అదా నిన్ను తెమ్మన్నది. నేయియ్యకపోతే నీవుయిస్తావనాయేమిటి వాడు నీతో గోడు పెట్టుకోవడం. షుబేదారుగారూ ! చూశారా మంగయ్య నడత ? నాపాదంబట్టి నాతో అనేక ప్రమాణికాలుచేసి జ్ఞానబోధ చేసినవాడే యిలా అడుగుతున్నాడో ! ఇంకా వీడికి జ్ఞానసిదియెక్కడిది

షుబే—గురువాజ్ఞ వర్తకులకు డబ్బుదగ్గిర మరియేదీ పనికిరాదండి. నేనుగూడా ఒకసారిమందలిస్తే తెరువైతే నాకొంపపోగొట్టుకుంటావా అన్నాడు. వాడితో మనకుతగాదా పరువుగాదు. ప్రొద్దెక్కిపోతున్నది.

వెంకో—లేవండి, అడుగో సిద్దయ్యగారువస్తున్నారు. ఇంక కలిసి వెళ్లుదాము.

(అప్పుడు సిద్దయ్య తావళముత్రిప్పుచు ప్రవేశించుచున్నాడు

సిద్ద—(వెంకోబారావుపంతులుగారి పాదములమీఁదబడి, అయన అరికాలుగోకి, నెత్తినజల్లుకొని) తూర్పువీధియోగిమనలను అవచ్చిన యోగిని యివాళ యెగరగొట్టుతాడట. "రానీ యివాళచూస్తాను" అని కేకలువేస్తున్నాడట.

వెంకో—షుబేదారుగారూ! పదండి, చూద్దాము వాండ్లమొగము వాండ్లకేమి తెలుసు. మాషుబేదారుగారి ప్రశ్నలకొకటి జవాబు చెప్పిగెలిస్తేగద! వారిప్రజ్ఞసాగటము.

సిద్ద—నిజమేమర్చిపోయినాను. వెనుక కలకత్తాయోగివచ్చినప్పుడు కూడా మనషుబేదారుగారే వోడించారు. ఈయనకు సభాకంపము లేదు. అందుకనె యెంతెంతవాండ్లని యిట్టెబుట్టలో పెట్టుతారు. ఆలోచించుకుందాముపట్టండి- ఏప్రశ్నలడిగితేబాగా వుంటుందో?

షుబే—దీనికింత సేపాలోచన యెందుకండీ? అసలు విత్తుముందో చెట్టుముందో చెప్పమనండి చూస్తాను- అతను విత్తుముందంటే నేచెట్టుముందంటాను. చెట్టుముందంటే విత్తుముందంటాను.

వెంకో—అయితే షుబేదారుగారూ! చెట్లుకశ్యపప్రజాపతి సంతానమంటే.

షుబే—కశ్యపప్రజాపతియెవడు- కశ్యపన్న? "అంతాబ్రహ్మమయం యీజగమంతా నాదమయం" అనియుండగా ఆకశ్యపన్నయెవడని అడగనూ! ఇది ఒక్కటేనా ఇలాంటివిపిలకతొంభయివున్నవి. కర్మముందా జీవుడుముందా! ఆయన అది ముందంటే నేయిదిముందంటాను

వెంక—దానికి ఆయన. 'సర్వంమిథ్య బ్రహ్మసత్యం' అంటే-

షుబే.-అలాయితే- గుర్వాజ్ఞ- సర్వంమిధ్య అయితే నీవు మిధ్యే గీ అవధూతత్వముమిధ్యే అని యెగరగొట్టివేస్తాను. ఏవిధంగా నైన యీమహాయోగివల్ల మనకు చాలా లాభంవుంది- ఆయన పక్షమే మాట్లాడుదాముదండీ- ఇందులో యేదయినా దావువస్తే పాపము విశాలాక్షమ్మగారికి యేదయినమంచి నగ కొనిపెట్టు దాము. ప్రొద్దెక్కి-పోతున్నది- జనంబాగా నే పాగింది-

సిద్ధా—మన విశాలాక్షివుంటే యీపాటికివచ్చేదే.

వెంకో— విశాలాక్షి వూళ్ళో లేదు. మూడురోజులైంది రాజమహేంద్రవరంవెళ్ళి ఇవాళవచ్చివుండాలి.

షుబే—విశాలాక్షీగారివల్లనే మనమతం యింతబాగా వ్యాపించడానికి కారణము. మనసమాజములోనికి ఆవిడెరాకపూర్వము మన ముమ్ముగ్గురముతప్ప నాలుగోమనిషే లేడు.

వెంకో—విశాలాక్షి మంచివేర్పరి చూశావుగావూ మొన్న కత్తులపెట్టెలో పెట్టినట్టు జాగ్రత్తగా బయిటికిరానియ్యకుండా వుంచినవీరయ్యగారి కూతురిని యెలాతీసుకవచ్చిందో ?

షుబే—అవునుమనవల్ల ఆమెకులాభం. ఆమెవల్ల మనకూలాభం మొన్నమానానికి మొన్నవాలుగు నెలలక్రిందట ఆమెకువచ్చిన ఆపదకు మనసిద్ధయ్యలేకపోతే యీపాటికి కులంలోనించి వెలివేసేవారే.

వెంకో—వెలిచేసేవాడెవడండీ ఒకడువెలివేస్తేవినేవాడెవడు?

షుబే—మీలో శంకరాచార్యులు వున్నాడటగా- ఆయనమీ అందరికి గురువట.

వెంకో—మాకూ శంకరాచారికి పీర్లపండుగకు గోకులాష్టమికి యెంతసంబంధమో అంతేసంబంధం నాకు నేనేగురువును షుబేదారూ అహంబ్రహ్మాస్మి మరచిపోయినావూ ?

షుబే..గుర్వాజ్ఞ. సెలవుప్రకారం- అయినా కడుపూ గట్రాఅయి

తేలోకులు వ్రాయకుంటారా ?

వెంకో—ఇంకా అలా అనంటేబాగుంది. సిద్ధయ్య నాతో చెప్పా
వుగా వేం ?

సిద్ధ—జ్ఞాపకంచేశారు గనుక చెపుతాను- ఆవిడొక్కేగాదు. ఇంకొక
బ్రాహ్మణవిధవకూడా నాదగ్గరనుంచి మందు పట్టుకువెళ్ళింది.
ఎంతమహావేదాంతినివలె నటిస్తుందనుకున్నారు ?

వెంకో—మనము నటించడములేదూ. మనశిష్యురాలుగాదూ ఆవిడే
మట్టుకు నడవండి తోటలో అప్పుడేజనంనిండిపోయినారు.

సిద్ధ—అదుగో వంతెనదగ్గర వచ్చేదిమన విశాలాక్షి గాదూ !

వెంకో—(వెనుకకుజూచి) వస్తే ఆవిడ వెనకనుంచివస్తుంది మనంముందు
వెడదాంపదండి ఆవిడా మనమూ కలిసి వెళ్ళుతుంటే నలుగురికి
అనుమానంగావుంటుంది

షుబే—నిజమేపదండి. మనము వెళ్ళి ముందు దర్శనము చేద్దాము.

[అప్పుడువిశాలాక్షియు, సుందరమును వచ్చుచున్నారు]

విశా—సుందరం! ఎంతవ్యర్థురాలవే! ఇంట్లో రాత్రిపగళ్ళు వంటచె
య్యటముతప్ప మరేదియెరగవు జన్మతరించేసంగతి చూసుకో
వుగదా! ఈ అన్నలు, తమ్ములు, తల్లిదండ్రి అప్పుడుపనికివస్తార
నుకున్నావా యేమిటి? ఎవరిదారివారిదే.

సుంద—నేనేమీ వ్రాసుపోవటములేదు. పనిపాట అయింతర్వాత రా
మరామా అనిబియ్యము లెక్కపెడుతుంటాను. నాలుగుసార్లు ఆ
బియ్యము బ్రాహ్మలకు సంతర్పణచేశాను

విశా—ఇదాజ్ఞానమంటే? సరే (పెదవివిరచి) కర్మకాండవలఫలము
లేదు. ఇంతభగవద్గీతలు చదువుకోవాలి తారకమంత్రము వుప
దేశముగావాలి యోగధారణ నేర్చుకోవాలి. అదిగానిబియ్యము
లెక్క, సంతర్పణలువా జ్ఞానమార్గాలు ?

సుంద—మా అన్నయ్యతో చెపితే యెవరిదగ్గరకూ వెళ్ళనియ్యాడు.

విశా—జ్ఞానబోధకులోకములో యున్ని అటంకాలే. ఎవరిజన్మతరించు
డానికివారు చేసుకొనేవి ఒకరితో చెప్పా చేసుకోవటము?

సుంద—అందుకేగా ఈమహాయోగి దగ్గరకు వెళ్ళుతున్నాము.

విశా—ఈయన దర్శనలాభమేగాని యీ అడవిలో జ్ఞానబోధ, ఉ
పదేశాలు సాగవు- నీవునిజంగా బాగుపడాలని మనసుంటే చెప్తా
ఒకనాడు వెంకోజీపంతులుగారి దగ్గరకుతీసుకువెళ్ళుతాను-

సుంద— మాకాయన దగ్గరబంధువుడు- ఆయన యెదట పడతావా?
ఇక్కడికి మా ఆయనపోయినవాలుగేండ్లనుంచీ నేనెవరికంటా ప
డలేదు- ఇవాళసంఘమువీాద యెవరుచూస్తారనివచ్చాను.

విశా—బంధువుడయితేయేమి? ఆయన కీలోకమందు యిష్టమే లేదు-
వారికేమనిషిలాగు అగపడతారుగాని నిజముగా నిస్సంగులు. ఎ
వ్వరితోను చెప్పరు- మాసంఘములో నెందరున్నారో యెవరి
కితెలుసును? అయ్యగారు యోగముపట్టితే భూమికి నిలివిడెత్తున
లేస్తారు- నిముషములో పసుపుపిండి బంగారము చేస్తారు- ఆయన
కేమిమహానుభావులు.

సుంద—ఆయన బంగారము చేస్తే ఆయనభార్య లక్ష్మమ్మ డబ్బుంతా పా
డు చేస్తున్నారని రోజూ అఘోరిస్తుంది యెందుకని?

విశా—ఆవిడెవట్టి అవకతోకమనిషి అయన వొక్కనాడుబంగారము
చేసేటప్పటికి, రోజూచెయ్యమని పట్టుకుంది- మహాత్ములకుభార్య
లయందును సంతానమునందును మమకారముండదు-

సుంద—అదుగో అంతా వెళ్ళుతున్నారు మనముగూడా వెళ్ళుదాము
పద- ఆనక మాట్లాడుకోవచ్చును.

(అప్పుడు అవధూతయు, శిష్యుడు కృష్ణారావును
ప్రవేశించుచున్నారు)

కృష్ణా—మనమేముందుగా వెళ్ళితేలోకులకు మనయందుగౌరవముతగ్గి

పోతుంది- అమతంవారు బహుశః యింకా వచ్చియుండరేమో? నన్నింత తొందరపెట్టి తీసుకువచ్చినారు-

అవ—షుబేదారు పంతులుగారు ౧౦ గంటలకే వెళ్ళినట్లు తెలిసింది. మళ్ళియీయాయనను కూడా భ్రష్టుచేస్తారు కాఁబోలు- వారంతా పరమానందయ్యగారి శిష్యులు.

కృష్ణా—ఇదుగో చూశారా! విశాలాక్షమ్మగారిని.ఎల్లా వెళ్లుతూవుందో?

అవ—అయితేసరే ఆపంతులు, వారంతా అక్కడికి వెళ్ళేవుంటారు. వారు వెళ్ళకపోతే యీవిడెబయులుదేరదు-

కృష్ణా—ఈమెసుమండీ! పంతులవారి మతంలో వున్న మోహనయంత్రం- ఈమెకూడా గురుమంత్రవుపదేశం చేస్తుందట-

అవ—నాకు తెలుసునులెండి! అదుగో యెవరో చిన్నదాన్నికూడా తీసుకుని బయలుదేరిందే!

కృష్ణా—ఆమె రామన్నపంతులుగారి కుమార్తె. ఎన్నడూ వచ్చేదికాదే కొంపనీసి ఆపిల్లనుగూడా సానికెలో చెయ్యి వేయించింది కాఁబోలు.

అవ—లోకమంతా మాయవేదాంతములోపడి మునిఁగిపోతున్నది క్రిష్ణారావుగారూ! పంతులూ, షుబేదారు, జంగము సిద్ధయ్య అంతాకలిసి తింటారఁట యేమిపాపమయ్యా!

కృష్ణా—చిత్తము వాండ్లు రాత్రిళ్ళు తప్పతాగి 'తారకమంత్రము కొంత కదొరికెను' అని తందనాలాడుతారండి. జాతివివక్షత, నీవనేమీ భేదండి, యిదటస్త్రీపురుషవివక్షత పనికిరాదఁట. తరువాత కులగోత్రములు లేవఁట.

అవ—అందుచేతనే మాట అటుంచనీ బ్రాహ్మణులుండాకొడుకుగదా పంతులుకేమి తెగులు.

కృష్ణా—మోహనయంత్రానికి లోపడ్డాడండి, ఎప్పటికైనా ఆవిశాలాక్షిని పట్టుకుంటే యిది అంతా బైటపడుతుందండీ!

అవ — కలిమాయ ఎవ్వరూ దాపగలేదు. అయితే మనము వెళ్ళవలసిందేనా,

కృ — నేత్రోత్సవముగా చూచి రావచ్చునుగదా! వీరితో మనకేమి మహాయోగిదర్శనముగదా ముఖ్యము. జనంచాలాచేరింది.

అవ — ఒకప్పుడు కొందరు దుర్మార్గులు మాయవేషము వేసుకొనికూడా ప్రజలను మోసబుచ్చుతారుసుమీ!

కృష్ణా — తమరన్నది నిజమేగాని యిదిమట్టుకు అలా అయివుండదు. త్వరగా రండి అక్షతలదారినుంచి వెడదాము.

విశా — సుందరం. నడుమ అడుగో అవధూతచూశావా? ఈయన పట్టిదొంగ ఉపదేశాలుచేస్తానని డబ్బులాగుతాడు. ఎప్పుడైనా యీయనదగ్గిరకు వెళ్ళేవుసుమీ

సుంద — అవధూత అంటే ఆవుద్యోగస్థులకు అంతటికీ గ్రంథాలుచెప్పేఆయనేనా? ఆయన మంచివాడంటారే చాలామంది.

విశా — వాడిమంచి మండిపోయినట్టేవుందిలే. మందు నిమ్మళముగా చూపించి తరువాత బోగందిలాగినట్టు డబ్బుగుంజుతాడు.

సుంద — ఈ వేదాంతాలలోకి దిగానని తెలిస్తే మావాళ్లునన్ను వాతిపెట్టుతారు. ఇదంతా పట్టిమాయంట మొన్న వీరయ్యగారి కూతురిని యెవరో వేదాంతము నేర్పుతామని తీసుకువెళ్ళారంట ఆమాట మానాన్నగారికి తెలిసినప్పటినుండీ నన్నుమరీ అవలికి యివతలికి దాటనియ్యటములేదు.

విశా — మనవాండ్లకబుర్లకేమిలే! ఎప్పుడో లోకము మునుగుతుందంటే యిప్పుడేమునిగిందంటారు- ఏమయినాసరేగాని ఆ అవధూత దగ్గరకుమట్టుకు వెళ్ళకు.

సుంద — నాకెందుకు అసలు మావాళ్ళు నన్ను గడప దాటనియ్యరు. ఇవాళంటే ఎలాగో తప్పించుకొనివచ్చాను.

విశా — అదుగో చూశావా ఆయనే మహాయోగి నమస్కారము చెయి.

శ్లో॥ గురుర్బ్రహ్మాగురుర్విష్ణుర్గురుదేవోమహేశ్వరః।
గురుస్సాక్షాత్పరబ్రహ్మతస్మైశ్రీగురవేనమః॥
[అనిచదివి దవడలు వాయించుకొనుచు.)

ఇలారా! ఇక్కడకూర్చో నేను షుబేదారుగారితో మాట్లాడి వస్తాను

విశా—(షుబేదారు చెవిలో నేమియో చెప్పుచున్నది.)

షుబే—[ఆ తట కలయజూచుచు పంతులుగారి చెవిలో చెప్పి వీరాస్వామినిగోకి] అదుగో ఆ పావుకోళ్ళ ఆయనే అధూత! చూశారా! ఆయనకు ఉద్యోగస్థులు నెలనెలకు జీతాలు ముడుపుగట్టి పంపుతారు నెలకొక డిప్టీకలెక్టరు జీతమంతవసూలౌతుంది ఏదోయిలా డాబుమీంద కొట్టుకొస్తున్నాడు.

వీరా—(తనలో) ఈయనిజముగా వేదాంతివలెనున్నాడు జనులకు కూడా ఆయనయందే గౌరవమున్నట్టు తోచుచున్నది నేనీపాడుషుబేదారును పట్టుకున్నాను ఎంత సేపుచూచినా జనము అరటిపండ్లేగాని రూపాయలు రావడము లేదు. [ప్రకాశముగా) అంతా తమదేభారము. ఇంకా పాదపూజలు యేమీలేదు.

షుబే—ఇదుగోయిప్పుడే వస్తావుండండి. ముందు స్త్రీలారంభించి చేగాని బాగాసాగదు. (రహస్యముగా) తమదగ్గర నాలుగు రూపాయలుంటేఇయ్యండి మాశిష్యురాలిచేతచేయిస్తాను.

వీరా—[తనలో] ఏమీరాకపోగా వున్నవి నాలుగూవూడతాయేమో? జనముచూస్తే కడుపునిండుతుంది. అయినా యిచ్చిచూస్తాను. [ప్రకాశముగా] ఇవిగో (అందిచ్చుచున్నాడు.]

షుబే—విశాలాక్షిగారా! పాదపూజచేస్తారేమి? చిత్తముచెయ్యండి [విశాలాక్షి పాదముముట్టుకోగానే యోగిచక్కిలిగింతచేత నవ్వుచున్నాడు)

కృష్ణా—చిత్తగించారా! విశాలాక్షి పాదపూజకు యోగి ఎలావప్పుకు
న్నాఁడో!

అవ—యుదారము మహానుభావులకు తెలియకపోదు.

వీరా—[యోగివంక జూచి కన్నుగీటు జేయుచున్నాఁడు]

యోగి—[వీరాస్వామివంక బిక్కమొగముతోఁ జూచుచున్నాఁడు]

[అంతట స్త్రీలనేకులు పాదపూజఁ జేయుచున్నారు,

యోగి—(తనలో] డబ్బువచ్చుచున్నది గాని డబ్బుతో పాటు నాకు మూర్ఛకూడా వచ్చేటట్టున్నది ఇక్కడికి ౧౨ గంటలైనది తెల్లవారజామున యేమి తిన్నానోగాని మళ్ళీ యేమీలేదు నేను లేవవలెనని యెన్నిసార్లు చెప్పినా అతఁడు కోపపడుతున్నాఁడు ఈమాట డిగిచూస్తాను.

[ఆఁ వీరాస్వామిని బ్రతిమాలుచు చేతులుజాపుచున్నాఁడు]

షుబే—వీరాస్వామిగారూ! యోగిగారు యేమిటి అడుగుతున్నారు?

వీరా—అది అడగటము కాదు. జనులయొక్క దుస్థితికి జాలిపడి మధ్యమధ్య భగవంతుని వేడుకొనుచుండుట వారికి వాడుక లెండి.

యోగి—(తనలో] నేను బ్రతిమాలినా అతఁడేదో మిష పెట్టి చెప్పివేసినాఁడు నన్ను లేవనిచ్చే యెత్తులేదు ఆకలికి ఆగలేకుండావున్నాను అడిగిచూస్తాను [ప్రకాశముగాఁ జేతితోఁ బొట్టజూపుచు మైవ్యాము నభినయించుచున్నాఁడు.]

వెంకో—షుబేదారుగారూ! పాపము వారికి పాలు, శక్కర. కలిపి ఇయ్యండి. దాహముపుచ్చుకుంటారు.

వీరా—(అడ్డపడి, ఏమిమీ అవివేకము! మహాయోగుల సంగతులు కనుక్కోలేకుండా వున్నారు. వారు నిరాహారులు వాయుభక్షకులు, వారికేమి పాలూ పంచదార కావలయునా? ఇదా మీరు గ్రహించినది?

వెంకో— అయ్యో! అలాకడుపుచూపుతూవుంటే కాదంటారేమి? యోగులయినా పాలుపుచ్చుకోవడము వలన తప్పలేదు-

శిద్దె—ఎప్పుడయితే నర అడవిలో తిరుగుచున్నారో అప్పుడు పాలు పుచ్చుకొనటమే ముఖ్యము. లేకపోతే మూలాధార చక్రమునకు తీక్షణము కలుగుతుంది.

వీరా—అదిగాదు వారితాత్పర్యము యీపండ్లు ఫలహారములు యెందు కీపొట్టకని చెప్పుచున్నారు.

యోగి—(తనలో) అయ్యో! పాపిష్ఠిముండాకొడుకు నన్ను నిష్కారణముగా చంపుతున్నాఁడు. నోటివగ్గరకు వచ్చినవిగదా అనుకున్నపాలు మళ్ళివెనక్కులాగించాడు. నాకుకళ్ళు తిరుగుతూవున్నవని చెప్పుతాను. (ప్రకాశముగా) చేతి వ్రేలు గిర గిర త్రిప్పుచున్నాడు.

వీరా—[కన్నులురిమి భయపెట్టుచు ప్రకాశముగా] చిత్తము యోగములు తిరుగుచునేయున్నవి. పాపము పెలుగుచునేయున్నది- (అనినవ్వుచున్నాఁడు)

యోగి—(లోని కోపమునాపలేక ఇక నేనుండలేనని చేతులతో సంజ్ఞచేయుచున్నాఁడు)

వీరా—(డబ్బువచ్చుచుండూసమయములో నాతఁడట్లు చేయుటకుఁగోపపడుచు) చిత్తము. తమరే లోకులపాపమునకు బెదరితే యిఁక మాకుదిక్కెవ్వరు తమరులేచివెళ్ళితే మేముగూడా తమ వెంటనే వస్తాము.

యోగి—[తనలో] ఇక నేనేమిచేయను. నే నొకవేళ లేచిపోయినా యితఁడు అందరితో నావెంటపడక మానఁడు. నాకీరోజున అన్నప్రాప్తిలేదు- భగవంతుఁడేమిచేసినను సరే- (అని దైన్యముఁజూపుచున్నాఁడు)

వీరా—(తనలో) ఇంక పరవాలేదు కుదటపడ్డాడు. మూర్ఛరాకుండా వుంటే ధన్యుడనే (అని పాదపూజరూపాయలు పోగు చేయుచున్నాడు)

కృష్ణా—చూశారా! అప్పుడే పంతులు యేప్రకారముగా పాలు పంచదార అందిస్తున్నాడో? ఏదో మహోపాయము చేత తానులాంగదీయవలెనని ఆలోచిస్తాడు.

అవ—ఎవళ్ళపాపాన వాళ్ళేబోతారు మానకెందుకు వూరుకుందాము

కృష్ణా—చూడండి, ఆషుబేదారు, సిద్దైయ్యగాడు యెలా పూజారులవలె దగ్గిరకుచేరుతారో. చివరకేదో మాదర్చోదీ చేసేటట్టుకనపడుతుంది.

అవ—యోగికూడామనమనుకొన్నంత సమర్థుడు వలె కనుపించడు. ఎంతసేపుచూచినా దైన్యముగ పడుతుంది. దగ్గిరకు వెళ్ళి సంభాషించి చూడవలెనంటే మౌనవ్రతముపూనాడు.

కృష్ణా—ఆచేసేపిచ్చిగుర్తులు, వీండ్లుచెప్పే తత్వార్థాలు చూస్తే నాకు అనుమానంగానేవుంది. ఎలాగయినా ఒక్కసారి ఆయన సత్తువ యెంతో కనుక్కుందురూ

అవ—మనకెందుకు పోనిస్తురూ! మనమింకయింటికి వెడదామురండి.

కృష్ణా—అలా కాదు మీరునామనవివిని ఏదైనా అడగండి.

అవ—స్వామీ! తమరీ ఆశ్రమస్వీకారముచెసి యెన్నాళ్ళయింది?

యోగి—(వీరాస్వామివంక జూచుచున్నాడు)

వీరా—[షుబేదారువంక జూచుచున్నాడు]

షుబే—(పంతులవారితో రహస్యముగా] చూశారా మళ్ళీ అవధూత గాడు ప్రేలుటకారంభించాడు.

పంతు—వాండెప్పుడు అంతే. మనముదగ్గరకూర్చున్నామని యిందాకటినుంచీ చూసిచూసి యిప్పుడు ఆగలేక లేక వచ్చాడు.

సిద్దై—పంతులుగారూ మనకేం ఆలోచన.

షుబే—ఇకిసాగనిస్తే ఇక ప్రొద్దుపోయేకిందాకా ప్రశ్నలే అడుగుతాడు

పంతు—సాగనిస్తే పూర్వోత్తరమనకంటే యితనే యెక్కువవాడని తెలిసిపోతుంది. ఏదో ఒకరొత్తుచేసి ఆపాలి.

షుబే—వుండండి. నెమ్మదిగా తోపిడికారంభించి అల్లరిచేసి చప్పట్లు కొట్టుదాము

సిద్ధా—భేషు మంచి ఆలోచన. సిగ్గుపడిలేచిపోతాడు.

షుబే—[తోయుము] అయ్యో తోయ్యకండి తోయ్యకండి.

సిద్ధా—తోయ్యకండి తోయ్యకండి.

పంతు—కామూష్. కామూష్ [అనికేకలు వేయుచున్నాడు]

సిద్ధా—(పెద్దకల్లోలముశాలి చప్పట్లు ప్రారంభించుచున్నారు,

సుంద—అబ్బా! యేమిటమ్మా, యీతోపిడిలో నేవుండలేను అదుగో ౩ గంటలు తైలుకూడావచ్చింది. మనంవచ్చి చాలా సేపైంది. ఇక యింటికి వెళ్ళాలి- మా నాన్నగారు లేచే వేళయింది

విశా—వుండూ వెళ్ళుదువుగాని తోపుడుసద్దుమణుగుతుంది మరి, మనమనుకున్నట్టు ౩ గంటలకే యీయన వస్తే యిప్పుడుండేదానవా కావా?

సుంద—౨ గంటలకైతే రాకనేపోదును. నన్ను వెళ్ళనిస్తూ నీవు రాకపోతేమానె.

విశా—పంతులుగారినిచూశావా?

సుంద—చూశా. నన్ను వెళ్ళనీ.

విశా—మరినీవు జ్ఞానబోధకు యెప్పుడువస్తావో చెప్పు?

సుంద—నేనిప్పుడు చెప్పలేను. నన్ను వెళ్ళనిస్తూ. నా బట్టకొంగువిడు-

విశా—[తనలో, ఇదిమట్టుకు మన మంత్రాంగాలకు పడేటట్టులేదు. పంతులుగారెన్నాళ్ళనుండో దీనిమీద ప్రాణాలుపెట్టుకున్నారు కానీ నెమ్మదిమీద విచారించాలి. [ప్రకాశముగా] వెళ్ళుదాము పద.

వీరా—[రయిలుకూతవిని తనలో] ఆశకుమితిలేదు. ఇక్కడికివచ్చిందేచాలును. రయిలువచ్చింది. ఇంక కపటము దాగదు. తీర్థాభాసయినతరువాత చేసేదిదేమీలేదు. ముందుడబ్బు షుబేదారు కంటబడకుండా దాచేసే సాధనం చూడాలి. [ప్రకాశముగా] వుండండి పాదపూజలు సర్దుతాను.

షుబే—[దిక్కులుచూచి తనలో] ఆహా! వీరాస్వామి యీపాదపూజలు మూటగట్టాడు. గలభాలో దాచేటట్టున్నాడు. [ప్రకాశముగా] అవియిప్పుడుముట్టుకోకండి.

వీరా—[యోగివంకజూచుచున్నాడు]

వెంకో—[తనలో] అవధూతను అడగగొట్టాలి. మహావిజృంభించాడు. [ప్రకాశముగా] మంత్రప్రశ్నలు మరొకప్పుడు చూచుకోవచ్చును వారినికదపకండి

క్రిష్ణా—తమరిక్కడ స్వాములవారితరవున వకాల్తీ పుచ్చుకోనక్కఱలేదు.

వెంకో—నేను అవధూతతో చెప్పుచున్నాను గానినీతోగాదు. నీవూరుకోవచ్చు.

క్రిష్ణా—అయ్యో! తమరెందుకిక్కడ పోట్లాడుకుంటారు? కక్షలూ కావేషీలువుంటే యింటిదగ్గరచూచుకోండి.

అవ—క్రిష్ణారావుగారూ తమరెందుకు వారితో ప్రసంగము చేస్తారు? వారిసంగతి తెలియదా?

క్రిష్ణా—తెలియకేమండి! మొన్నటికేసులో వీరిని రెండో ముద్దాయి చేర్చారట.

వెంకో—[సిద్దయ్యతో] ముందుక్రిష్ణారావుగారి పొగరణుస్తురూ, అవధూతగాడిదేముంది?

సిద్దె—మాషుబేదారు తలుచుకుంటే నిమిషములో అసాధ్యపు ప్రశ్నలువేసి పడగొట్టుతాడు.

పింకో—పిలు, షుబేదారుని-

సద్దా—[షుబేదారుతో] ప్రశ్నలడగమంటున్నారు సంతుంగారు-

షుబే—(అగుమః చేతితో సంజ్ఞ చేయుచుఁ బాదపూజలవంకఁ జూచుచున్నాఁడు-)

క్రిష్ణా—(యోగివంకచూచి) తమకు భార్యాశాంతి అయినదా?

యోగి—(వీరాస్వామివంకఁ జూచుచు తనలో) నాశాంతిమాటయీన కెందుకు? ఇదిచెప్పితిమా. ఇఁకనీభార్య కొన్నేండ్లనికూడా అడిగేట్టున్నాఁడు- వీరాస్వామి యేమిమాట్లాడఁడు- ఏమి చేయను? [అనికన్నులుమూసికొనుచున్నాఁడు,

వీరా—[రూపాయలను షుబేదారుకుఁ దెలియకుండఁ దీయఁజూచుచున్నాఁడు]

జను—ఏమయ్యా, వూరికే అలాగునుశోధన కారంభించావు- మనకెందుకు? సాధులకంటె మనకెక్కువ తెలుస్తుందా నామహాయోగి-

మతికొండయ్య—౩౦౦ ఏండ్లమాట మట్టుకు నిజంగాదు వడసారము ౮౦ ఏండ్లయినాతిన్నగాలేవు-

జను—యోగసిద్ధియే యీడులో అయితే ఎన్నాళ్ళున్నా ఆకాయమే వుంటుంది అదితెలియక అపచారపుమాటలు యెందుకని దోషము వడిగట్టుకుంటావు?

కొండయ్య—౩౦౦ యేండ్లమాటే నిజమయితే తల్లికోటయుద్ధము, రామరాజు సమాచారము తెలుసునేమో?

జను—అదితెలియకపోతే యేండ్లులేనట్టేనా! నాకు యేభయియేండ్లు ఇప్పుడుజరుగుచున్న బోయరుయుద్ధమేమిటో తెలియదు అందుకని నాకింక ౫౦ యేండ్లులేనట్టేనా? లేకపోతే చూచానంటే మట్టుకులాభమేమిటి?

కొండ—ఎంతసేపుచూచినా మాట్లాడఁడు ఇది మోసముగా వున్నది పయిగా బెజవాడరెయిలుమీఁద వస్తాఁడని యిదివఱకనుకున్నా

రు ఈయనపాపిష్టున్నే వచ్చాడు.

మతిక్షోం — వుండఁడి వుండండి కాలవమీఁద సవారివస్తున్నది-

(అప్పుడు కాలవగట్టున జనులతోఁబరమహంసయు,
శిష్యుఁడుతామప్పయు వచ్చుచున్నాఁరు)

క్రిష్ణా — ఎవరిదది [అని కేక వేయుచున్నాఁడు]

జను — స్వాములవారిది [అని చెప్పుచున్నారు]

పర — ఏమిటి ఆకలకలము!

జను — మూఁడు వందలయేండ్ల మహాయోగి వచ్చి దిగాడు- తీర్థప్రజ సాగింది-

రామప్ప — (ఆశ్చర్యపడుచు) ఎవరాయన?

పర — మనము వారిదర్శనము చేసిపోదాము-

రామ — (తనలో) ఔరా! ఎన్నఁడో రాబట్టే యింతో జనము వస్తుందనుకుంటే రాలేదు - ఇదియేదో వున్నది [ప్రకాశముగా] అక్కరలేదు- తమ దర్శనానికే వస్తారు- మనము బసలోకి పోదాము పదండి-

పర — అక్కర,-లేదు మనముపోయిచూచి తర్వాతబసలోకి పోదాము పదండి-

(అందరువచ్చుచున్నారు)

(జనులు, ఎక్కడివారక్కడ దారిఁదీయుచున్నారు)

యోగి — [వారినిఁజూచి భయఁపడి మూర్ఛబోవుచున్నాఁడు]

రామ — నమస్కారము (అనిపాదప్రణామముఁ జేయుచున్నాఁడు)

పర — (చూచి) తమదేయాశ్రమము?

క్రిష్ణా — ఈయోగి మహాయోగ సమాధిలో నున్నాఁడు అని (చూపుచున్నాఁడు)

వీరా—[దిగులుతోఁ దనలో] అయ్యో! ఇఁక నేనుదాటేయెత్తు లేదు. యోగిరానేవచ్చాడు పయిగా యీపాడుముండాకొడుక్కి మూర్ఛకూడా యిప్పుడేవచ్చింది ఏ ఆశ్రమమంటే యేమని చెప్పను! వారుమహా అసాధ్యులుగా నున్నారు. (ప్రకాశముగా) వారిది యోగాశ్రమము.

పర—[నవ్వుచున్నాడు)

రామ—యోగాశ్రమమని కూడా ఒక ఆశ్రమము బయలుదేరిందీ? యేమి కాలమహిమ!

వీరా—[ధైర్యముఁదెచ్చుకొని] వారిప్పుడు మాట్లాడరు. ఇది సమాధి కాలము.

షుబే—(వీరాస్వామితో, ఏమియో చెవిలో చెప్పుచున్నాఁడు.

వీరా—వుండవయ్యా? సమయం అసమయం ఎఱగవు అవతల ఎంతగం దగోళంగా వుంది.

షుబే—ఇది బాగుంది ఇయ్యవలసినదానికి చిరాకుపడతావేం.

వీరా—[యోగినిచూపి] చూడూ ఆయన యెలా నురుగులు గ్రక్కుచున్నారో.

షుబే—ఆనురుగులు గీనుగలు నాకుపనికిరావు- ఇవ్వవలసినది యిచ్చి కదులు- లేకపోతేబాగాసాగదు.

జను—[నురుగులు గ్రక్కుచు వాలిపోయినయోగి నాశ్వాసించు చున్నారు- పంగలకఱ్ఱ అంగవస్త్రము నీడిపోవుచున్నవి]

లక్ష్మ—(పరకాయించిచూచి) [తనలో) ఇతఁడు మనవూరి వెంకన్న వలెవున్నాడు- అవును వాడూ మూర్ఖులకోసము తలగడ్డము పెంచాడు (దగ్గరకువచ్చి మొలత్రాటికికట్టియున్న తాయెత్తుచూచి,) అవును నిజముగానతఁడే, నోటనురుగుకూడా వస్తూవున్నది ఇది సమాధిగాదు మూర్ఛ ఇకనితనికి చన్నీళ్ళుపోయకపోతే నిజముగా సమాధికట్టవలసివచ్చేటట్టున్నది. (ప్రకాశముగా] అయ్యో

ఇది సమాధిగాదు మూర్ఛరోగము. తెండిచన్నీళ్ళు చచ్చిపోతా
డు (అని అరచుచున్నాఁడు.)

వీరా—ఆఁ. ఆఁ. ఎంత అపరాధము. ఎందుకీదోషము మాటలు, ఇది
హఠయోగసిద్ధి మీకు తెలియదు (అని వాదించుచున్నాఁడు.]

లక్ష్మ—ఇతఁడు మా వెంకయ్య నే నెఱుఁగుదును ఇతఁడు యోగికాఁడు
వ్లాకాడుగాడు. [అనిదగ్గరకువచ్చుచున్నాఁడు]

వీరా—[భయపడుచు పారిపోజూచుచున్నాఁడు.]

షుబే—(వెంటనేపోయి పట్టుకొనుచున్నాఁడు.)

లక్ష్మ—[నీళ్ళుచల్లి లేవనీయుచున్నాఁడు. యోగి నురగ గ్రక్కుచుం
డ జనులందరు ఖిన్నులై లేచి షుబేదారు వీరాస్వామి పోట్లాట
లోనికి పోవుచున్నారు.]

వీరా—ఇందులో నీతాతసొమ్మేమీలేదు.

షుబే—నోరుమిగిలితివా అంటే తన్నియీడుస్తాను జాగ్రత, తరువాత
నీతాతయెవడు అడ్డమువస్తాడో చూస్తాను.

వీరా—[గుబురించుకొని జనములోపడుచు] కొట్టుతున్నాడుకొట్టు
తున్నాఁడు (అని కేకలువేయుచున్నాఁడు)

యోగి—[చన్నీళ్ళచేతమూర్ఛదేరి లేవసత్తువలేక పడుచు తనయిల్లను
కొని] అన్నాయి గోధుంజావ గోధుంజావ ఏమేడుస్తున్నారు
ఒశేవు నీవెక్కడికెళ్ళావు [అని కేకలువేయుచున్నాఁడు]

(పరమహంస జనులు పకపకనవ్వుచున్నారు)

లక్ష్మ—(వెంకన్నచచ్చె, వెంకన్నచచ్చెనని గంజిపోయుచు] వెంకన్నా!
యోగివెప్పుడైనావురా.

యోగి—(భయపడుచులక్ష్మయ్యనుచూచుచు గజగజవడకుచున్నాడు)

పర—పూర్వాశ్రమస్మృతి కలిగినదా?

రామ—చిత్తము కొంచెము సేపుంటే చచ్చిపోవును.

[జనులునవ్వుచున్నారు.]

లక్ష్మి—ఓరి నీయోగంకాలిపోను నీకీరోగంయేమిరా ఎవళ్ళైనపిచ్చ దయ్యాలకుపెట్టలేదుగద.

యోగి—(భయపడుచు నటునిటుచూచుచున్నాడు)

లక్ష్మి—నీకుభయంలేదు చెప్పు.

యోగి—నేనీఖర్మమేమియెఱగను దారినితిరపతిబోతూవుంటే వీరాస్వామి అని ఒకడువచ్చి నీకుడబ్బువస్తుంది. నీవువూరికేకన్నులుమూసుకొని కూర్చోమన్నాడు.

[పరమహంస, జనులు, అవధూత అందఱునవ్వుచున్నారు.]

అవ—చూశారా కృష్ణారావుగారూ! ఎంతమాయజరిగిందో ఇదియేదో షుబేదారుచేసిన భడవాపని అయివుంటుంది

లక్ష్మి—అయితే నీవెందుకు యీాలాగుండీతిప్పలు లేకుండా మాడి కూర్చున్నావు.

రామ—పరమహంసగారు! తమరు దయచెయ్యండి వెడదాము. [బసలోకి]

పర—కొంచెము వినోదము చూచిపోదాము మఱల యిట్టివిచిత్రములు కనుబడవు

రామ—అయ్యో! నేనెంతమూర్ఖుడను నిష్కారణముగా పాదప్రణామము చేసితిని.

పర—అందుకని చింతిల్లపనిలేదు ప్రతిజీవుడు భగవస్వరూపుడు. కామముతో చేయని ప్రతిక్రియయు ద్విగుణీకృతఫలములిచ్చునని గదా శ్రీకృష్ణులవారుచెప్పిరి.

యోగి—నేనేమియెఱగను అదుగో ఆషుబేదారు దగ్గిరవున్న అతనిని పట్టుకుంటే అంతా తెలుస్తుంది.

లక్ష్మి—కొందఱు షుబేదారు దగ్గిరవున్న సిద్దయ్య గురువును పట్టుకొనిపోవుచున్నారు.

యోగి—అబ్బే! ఇతను కాదు- అదుగో ఆ లావుపాటి ముక్కాయన నతీసికొనిరా
సిద్ధ—నేనేపాపమెఱగనయ్యా! పంతులుగారూ మాట్లాడరేమి?
పంతు—(ఇంటికిఁబారిపోవుచున్నాఁడు)
లక్ష్మి—ఇతఁడేనా?
యోగి—ఇతఁడే.

[అప్పుడు వెంకాయి, నాగరత్నము సాయంత్రము నీళ్ళకుబయలుదేరుచున్నారు.]

వెంకా—ఇదుగోనమ్మాయివదినా! అంతాతిరిగివస్తున్నారు- మహాతమాషాగావుంది. ఒక్కమాటలావస్తూ యేమిటో చూచివత్తాము.
నాగ—ఏముంది, ప్రొద్దునవచ్చాడన్న యోగివట్టివాఁడఁట, ఎవఁడో వకఁడు మంత్రాంగం చేసి యింత గంద్రగోళం చేశాడఁట- పోనీపద.
వెంకా—అయ్యో! జనం అంతా ఎవరో ఆయన చుట్టూవున్నారేం?
నాగ—ఆయనే నిజమైన పరమహంసఁట.
వెంకా—చూడు చూడు. అదుగో నలుగురు మనుష్యులు పట్టుకొన్నారే- అతణ్ని చూడూ! నాగరత్నం! ఇతఁడే సుమా మన్ని వంతెన దగ్గఱ తేటిపారఁజూచినవాఁడు.
నాగ—నిజమే. ఎంత అసాధ్యుఁడో! చూడు యెందరిని తెప్పించినాఁడో! గొప్పశక్తిగలవాఁడు.
లక్ష్మి—నీ వెఱుఁగకపోతే అమాయకుఁడు మా వెంకన్న యింతయింద్రజాలం చెయ్యలేడు ఏం వెంకన్నా అడుగ నేం.
యోగి—[హీనస్వరముతో] నీవుగాదూ నన్నిందులో కిదింపించి అన్నం నీళ్ళుకూడా లేకుండా చేశావు. ముద్దలేమాట్లాడవేం? ఇంకా

కా యెవరో పాలూపంచదారా గూడా యిస్తే పుచ్చుకోవాలా లేకూ?

వీరా—రామరామ నేనేపాపమెఱుఁగను. నీవుమహాయోగివని చెప్పితేగాదూ నేనునమస్కారముచేసి దగ్గరకువచ్చింది?

యోగి—ఓరిదొంగముండాకొడకా! నీవుగాదట్రా నాకీ పంగలకఱ్ఱ తెచ్చింది?

సిద్ధై—[పంగలకఱ్ఱఁజూచి తనలో] పీయోయ్! నాది యీపంగలకఱ్ఱ—ఇదియిక్కడికెలావచ్చింది. ఇప్పుడుగనుక నాదంటినా నన్నుగూడా హంగామా చేస్తారు. (ప్రకాశముగా] షుబేదారూ! ఈకఱ్ఱ యెప్పుడుతెచ్చావు?

[షుబే—చెవిలో నేమియో చెప్పుచున్నాఁడు]

(సిద్ధై—చేతితోనోరు మూసుకొనుచున్నాఁడు.]

వీరా—పంగలకఱ్ఱ నేను చూడనే లేదు.

యోగి—పో నీనాగుడ్డలు నాకుతే- [అనిమూటలాగుచున్నాఁడు)

లక్ష్మి—[వీరాస్వామిని రెక్కలుకట్టియీడ్చుచున్నాఁడు]

జనులు—(కలకలధ్వనిచున్నారు.)

వీరా—[బ్రతిమాలుకొనుచు లక్ష్మయ్యచెవిలో నేమియో చెప్పుచు) బుద్ధివచ్చినది. [చెంపలువాయించుకొనుచున్నాఁడు)

పర—(నవ్వుచుబయలుదేరి బసకుఁ బోవుచున్నాఁడు. జనులాతని వెంటఁజనుచున్నారు)

షుబే—(పోవుచు] సిద్ధైయ్యా! చూశావా! నాకెలా జరిగిందో? నాయముండాకొడుకు ప్రొద్దున్నె వచ్చి నీవు సహాయము చెయ్యాల్లని బ్రతిమాలుకొని సగము యిస్తానన్నాఁడు.

సిద్ధై—ఝూటాకోరు ముండాకొడుకు- ఎండటినో బుట్టలోపెట్టేస్తే మోసపోయినావేం? వూరికే మోసము గాకుండా నిష్కారణముగా నాపంగలకఱ్ఱకూడా పాడుచేస్తివి.

షుబే—ఇప్పుడుమనం యేంచేస్తే వాఁడుచిక్కుతాడో చూస్తా?

సిద్ధా—నీపుణ్యమాయిరిగాని ఇఁకవాణ్ని వదిలిపెట్టు-పైగామనం గూడా యీమాదర్గోష్టీలో చేరామని తెలిస్తే మనకున్న గౌరవం గూడా పోతుంది- ఇక్కడికయినదేమో అయింది నోరుమూసుకొని వూరుకొందాము.

షుబే—ఇవాళ నేవట్టి పొట్టిప్పిష్వైలేచాను వాఁడూ మొద్దుముండాకొడుకు ఆపెనుగులాటలో నావళ్ళంతాహూనహూనమయ్యేటట్టు నలఁగబొడిచాడు వరఁవరంయిప్పుడు నలుపుపెట్టుతున్నది.

సిద్ధా—అన్నీ మనమనుకున్నట్లుపోఁగవు. మనకెందుకు ఇఁకయిలాగంటి పాడువ్యవహారాల్లోకి దిగవద్దు. నామట్టుకు యిన్నటి వ్యవహారముతో సిగ్గువచ్చింది. ఆకేసులోనుంచి దాటి యివతలవూడిపడితినా యిఁక వేదాంతంమాని ఇంత వైద్యమన్నా చేసుకొని బ్రతుకుతాను.

షుబే—ఇంటికిపద ఇఁక ఆపరమహంస దగ్గరకువద్దు మనపంతులుసమయంలో దాటాడు-

సిద్ధా—ఏలాగయినా బ్రాహ్మలనునమ్మగూడదు- మన్నిరకబెట్టితనుచూడూ యేలాజారేడో?

షుబే—ఆయనయెప్పుడూ అలాగేచేస్తాడు నేనంటే వూళ్లోమునుపెంతో గౌరవం- ఈవేదాంతంలోకి దిగినప్పటినుంచీ, సరిగామాయింట్లో ఆడవాళ్ళే నన్నుజూస్తే భయపడుచున్నారు.

సిద్ధా—నీవిప్పడయినా గంజాయిమానితే బాగుపడవచ్చు-

షుబే—పంతులుతాగుడుకూడా నేర్పాడు దానితోయెక్కడదబ్బు చాలకచస్తున్నాను-

సిద్ధా—[వెనుకకుఁజూచి] జనంసద్దుగుంది అదుగోపీరాస్వామి పారిపోతున్నాఁడు.

షుబే — పిల్లిపోతుపిల్లిపోతు పిన్నదీర్ఘనదన్నట్లు అలక్ష్యముగ దక్షిణ వి ఆరగించాయలన్నీ.

సిద్ధా — అతఁడు చేదిగను మీఁదవచ్చినపోలీసు వుద్యోగస్థుడుకాడుగద!

షుబే — ఏమో నేనాయనవంక తిన్నగాచూడనేలేదు.

సిద్ధా — ఈపాటికి యింటికిపద, పొద్దుగూకుతున్నది చాలు ఇఁకయిల్లాంటివాటికి వెళ్ళవద్దు. బుద్ధివచ్చింది.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

(అక్కడబసలో పరమహంసయిట్లు చెప్పుచున్నాడు)

పర — జనులారా! ఈలోకములో మోసమనుకగొప్ప వ్యాధిగా వలంబింపఁబడుచున్నది. వేదుకన్నులారాజరిగిన మోసమునుజూచితిరి గదా? లోకలోచనమునకు వివేకము లేదు. వలయునప్పుడు ధీమంతులకును వివేచనోచిత విజ్ఞానము కొంతగానున్నది గద్దము, గోళ్ళు, కుంకుమబొట్లను జూచి మహాయోగులనుకొని మోసపోవుచున్నారు. జనులు విపరీతముగాఁ జెప్పుకొనుమాటలు కన్నాఁకణికగా వింటిని. అంతటపద్దదనిన నింతటబద్దదని లోకులూరక నమ్మియితరులను నమ్మింపఁజూతురు మిథ్యావేదాంతమునకు సద్యఃఫలితములగుపడుచునేయున్నవి. 300. 400 ఏండ్లనాడు లేవు. ఎవ్వరో మిథ్యులను మోసముజేయుటకే వాడుకవేసిరి. అదిపట్టుకుని మీరందఱు భ్రమపడి పోవుచున్నారు. అనేకులు దుర్మార్గులు వేదాంతమని మిషపెట్టి కుదరొంగలై. స్త్రీలను జెఱచుచున్నారు. జనులీదురభ్యాసమును తొలగించుకొనినఁగాని సంఘాభివృద్ధి కానేరదు.

[అనినిష్క్రమించుచున్నాడు]

జనులెల్లరుఁ దాముజూచిన చిత్రకథను జెప్పుకొనుచుఁ దమతమ గృహములకుఁబోవుచున్నారు.

సంపూర్ణము.